# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా జరుగుతున్నాయి.
- విశ్వవిద్యాలయాలు దేశానికి చారిత్రక సంపద కేంద్రాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు అధికారులు, ఆయిల్ కంపెనీల యాజమాన్యాలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
- ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్న ఖాళీలన్నింటిని ఏడాదిలోగా భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

====================

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు విశాఖపట్నంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్, విశిష్ట అతిధిగా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ హాజరయ్యారు. అలాగే రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఒడిశా గవర్నర్ కె.హరిబాబు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, గుమ్మిడి సంధ్యారాణి, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ప్రముఖ చలనచిత్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటై 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది క్రితం ప్రారంభమయిన ఈ శతాబ్ది ఉత్సవాలు నేటితో ముగియనున్నాయి.

====================

విద్యార్థులు సంపద సృష్టించే మార్గ దర్శకులుగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో ఈరోజు పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఆంధ్రా యూనివర్సిటీలో వందేళ్ల పండుగ జరుపుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయాలు దేశానికి చారిత్రక సంపద కేంద్రాలని వీటిని కాపాడుకోవాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. వర్శిటీ అభివృద్ధికి 500 కోట్ల రూపాయల నిధులు మంజూరు

చేస్తామని చెప్పారు. మరో 500 కోట్ల రూపాయల కార్పస్ నిధులు అవసరమవుతాయని వీటికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. దేశంలోని ఉన్న ఐదు ఉన్నత విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటని పేర్కొన్నారు. విశాఖపట్టణం గ్లోబల్ సిటీగా రూపు దిద్దుకుంటుందని, విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యూనివర్శిటీలో 64 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన చేశామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వెల్లడిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================

ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఉన్న ఖాళీలన్నింటికి నియామకాలు చేపట్టి ఏడాదిలోగా భర్తీ చేస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విశాఖపట్టణంలోని ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న శతాబ్ది వేడుకలకు ఆయన ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ విశ్వవిద్యాలయంలో చదువుకొని ఎంతో మంది విభిన్న రంగాలలో సత్తా చాటారని చెప్పారు. వందేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం సాధారణ విషయం కాదని, దీని స్థాపన వెనుక ఎంతో మంది కృషి, త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. దేశంలోనే ప్రాచీన విశ్వ విద్యాలయలలో ఆంధ్రా యూనివర్సిటీ ఒకటి అని తెలిపారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తొలి కేబినెట్ ఏయూలో నిర్వహించామన్నారు. వర్సిటీ అభివృద్ధికి నిధులు సమకూరుస్తామని, యుద్ధ ప్రాతిపదికన ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

=====================

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ లభ్యతకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించేందుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి ఈరోజు ఉండవల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సివిల్ సప్లై ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు అధికారులు, ఆయిల్ కంపెనీల యాజమాన్యాలు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో పరిస్థితులపై ఆర్టీజీఎస్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి ప్రతీ 3 గంటలకు ఒకసారి నివేధిక ఇవ్వాలని ఉన్నతాధికారులు, మంత్రులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సాయంత్రానికి దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణ స్థితి ఏర్పడుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

విరామం

=====================

గూగుల్ క్లౌడ్ డేటా సెంటర్ తో విశాఖపట్నం రూపురేఖలు మారనున్నాయని స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ అన్నారు. విశాఖ జిల్లా తర్లువాడలో రేపు శంకుస్థాపన జరగనున్న గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ డేటా సెంటర్ ప్రాంగణాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామితో కలసి ఎంపీ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ భరత్ మాట్లాడుతూ... లక్షా 40 వేల కోట్ల రూపాయలతో ఒక కంపెనీ విశాఖపట్టణానికి రావడం భారత చరిత్రలోనే అతి పెద్ద పెట్టుబడిగా నిలుస్తుందన్నారు. డేటా సెంటర్ నిర్మాణ దశలో విస్తృత స్థాయిలో నిర్మాణ రంగ ఉద్యోగాలు లభిస్తాయని, ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత దాని చుట్టూ ఐటీ, ఏఐ ఆధారిత ఎకోసిస్టమ్ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. డేటా సెంటర్ సమీపంలో వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల బ్యాంకులు, ఫిన్‌టెక్, ఐటీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. అదే విధంగా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ... గూగుల్ సంస్థ విశాఖను ఎంపిక చేసుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఇది ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

రబీ సీజన్‌లో పండించిన మొక్క జొన్న పంటను కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకాన్ని వర్తింప చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయని, ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర 1600 నుండి 1700 రూపాయల మధ్య మాత్రమే ఉందని తెలిపారు. కనీస మద్దతు ధర 2,400 రూపాయల కంటే చాలా తక్కువగా ఉందని, రాష్ట్రంలో సుమారు 42 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉందని, సకాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. PM-AASHA పథకం కింద నేరుగా రైతులకు ధరల వ్యత్యాసాన్ని చెల్లించాలని, ఈ పథకాన్ని జూన్ 2026 వరకు పొడిగించాలని ఆ లేఖలో కోరారు. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

====================

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను ఈరోజు దర్శించుకున్నారు. ఈ ఉదయం  శ్రీకూర్మ క్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల దర్శనం అనంతరం ఉపరాష్ట్రపతి నేరుగా కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు నివాసానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దివంగత కేంద్రమంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

====================

తిరుపతి సమీపంలోని శేషాచలం అడవుల్లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంపై అటవీ, పర్యావరణ శాఖా మంత్రి కె. పవన్ కళ్యాణ్ స్పందించారు. అగ్ని ప్రమాదం కారణంగా అటవీ సంపదకు భారీ స్థాయిలో నష్టం జరగడం దురదృష్టకరమన్నారు. పెద్ద ఎత్తున మంటలు విస్తరించకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వేసవి తీవ్రత తగ్గే వరకు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కారుకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సిబ్బంది సమీప గ్రామాల ప్రజల సహకారం తీసుకుని తక్షణ నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరం అయితే అటవీ పరిసర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

====================
====================